క్లుప్తంగా

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీవారికి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారి ప్రత్యేక అలంకరణకు వస్త్రాలను, అభిషేక సామాగ్రిని మంగళవాయిద్యాల నడుమ తీసుకువెళ్లి సమర్పించారు. అభిషేకాల అనంతరం స్వామిని అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో ప్రత్యేక సదుపాయాల కల్పన



మార్కెట్‌ను పరిశీలిస్తున్న మహేష్

భీమునిపట్నం: భీమిలి పెద్దబజారు వద్దనున్న కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులకు అవసరమైన సదుపాయాలను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కల్పించనున్నారని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్ తెలిపారు. దీనికి సంబంధించి శుక్రవారం ఆయన జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాముతో కలిసి మార్కెట్‌ను పరిశీలించారు. ఇక్కడ వీరికి అవసరమైన మరుగుదొడ్లు, షెడ్లు, మంచినీటితో పాటు ఇతర సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఇందుకు ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, త్వరలోనే అన్ని ఏర్పాట్లు జరుగుతాయని తెలిపారు.

మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



కుళాయిలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొండబాబు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెం ప్రాంతంలో ఏళ్ల తరబడి వేధిస్తున్న మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. రూ. 10 లక్షల జీవీఎంసీ నిధులతో 15 పాయింట్లలో ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయిలను కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిస్థాయిలో మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎండాడలో రాములోరి పాదుకలు



అయోధ్య రామయ్య పాదుకలు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ స్కైలైన్ అపార్ట్‌మెంట్స్ ప్రాంగణంలోని విజయగణపతి ఆలయంలో శుక్రవారం అయోధ్య శ్రీ రాముని పాదుకలకు ప్రత్యేక పూజలు చేశారు. అయోధ్యలో శ్రీరాముని పాదుకలు ప్రతిష్ఠించనున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఉన్న ఆలయాల్లో పూజలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఏర్పాటు చేసిన పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

కళాశాల.. తరలిస్తే ఎలా?

- ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ తరలింపుపై విద్యార్థినులు, తల్లిదండ్రుల్లో ఆందోళన
- మరిన్ని సదుపాయాలతో చిట్టివలసలోనే కొనసాగించాలని అభ్యర్థన



కొత్తగా నిర్మించిన వసతిగృహంలో తాత్కాలికంగా నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాల

తగరపువలస : చిట్టివలసలో 2021–22 విద్యా సంవత్సరంలో ప్రారంభించిన ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను తరలించకుండా ఈ ప్రాంతంలోనే పూర్తి వసతులతో నిర్వహించాలని కళాశాల విద్యార్థినులతో పాటు స్థానికులు కోరుతున్నారు. వాస్తవానికి 2018లో అప్పటి ప్రభుత్వం ఈ కళాశాలకు స్థలం కేటాయించకుండానే బంగ్లామెట్ట వద్ద హడావుడిగా అప్పటి మంత్రి గంటా శ్రీనివాసరావుతో శిలాఫలకం ఆవిష్కరింప జేసింది. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తాత్కాలికంగా చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్లో మహిళా డిగ్రీ కళాశాలను ప్రారంభించి 30 సీట్ల చొప్పున ఏడు కోర్సులు అందుబాటులోకి తీసుకొచ్చారు. బీఏ (హిస్టరీ, ఎకనామిక్స్, పాలిటిక్స్), (ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, ఆఫీస్ మేనేజ్‌మెంట్), బీకాం కంప్యూటర్స్, బీకాం జనరల్, బీఎస్సీ (బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ), (మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ), (మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్) ఉన్నాయి. అడ్మిషన్లు మాత్రం ఆ ఏడాది బీఎస్సీ, బీకాం కంప్యూటర్స్ కోర్సులకు మాత్రమే జరగ్గా సరైన ప్రచారం లేకపోవడంతో గత విద్యా సంవత్సరం ఇక్కడ అడ్మిషన్లు జరగలేదు. ప్రస్తుతం భీమిలి, నర్సీపట్నం, నగరంలోని వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి 11 మంది అధ్యాపకులు వారంలో రెండు రోజులు ఇక్కడ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 17న ఉన్నత విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శోభారాణి కళాశాలను తనిఖీ చేసినప్పుడు కొత్తగా నిర్మించిన వసతిగృహంలో తాత్కాలికంగా డిగ్రీ కళాశాల తరగతులు నిర్వహిస్తుండటంతో వసతులు లేవని గుర్తించారు. 2023–24 విద్యాసంవత్సరం నుంచి కళాశాలను వసతులు ఉన్న మధురవాడకు తరలిస్తామని చెప్పడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

30 ఏళ్ల కలను చెరిపేయొద్దు..

1993 నుంచి చిట్టివలసలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కోసం స్థానికులు ఎదురు చూస్తున్నారు. ఈ ప్రాంతంలో జూనియర్ కళాశాల కూడా లేకపోవడంతో విశాఖ, విజయనగరం, మధురవాడ ప్రాంతాలకు జూనియర్, డిగ్రీ చదువుకోవడానికి పెద్ద సంఖ్యలో విద్యార్థినులు వెళ్లేవారు. సమయాభావం, ఫీజుల భారం కారణంగా చాలా మంది విద్యార్థినులు చదువుకు స్వస్తి పలికేవారు. ఇప్పుడు చిట్టివలసలో కళాశాల వచ్చిందన్న ఆనందం కంటే తరలిపోతుందేమోనన్న ఆందోళనతో స్థానికులు ఉన్నారు. ఇక్కడే పూర్తి స్థాయిలో వసతులు కలిగే వరకు ఒక్కో ప్రభుత్వ పాఠశాలలో ఒక్కో తరగతి గది కేటాయించి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను కొనసాగించాలని కోరుతున్నారు.

నగరంలో ట్రాఫిక్, కాలుష్యం



విశాఖ నగర పరిసర ప్రాంతాల కంటే చిట్టివలసలోనే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అవసరం. నగరంలో ట్రాఫిక్, కాలుష్యం, రాకపోకలకు ఇబ్బంది. ఇక్కడే హాస్టల్‌లో ఉండి చదువుకుంటాం.

ఎస్.శైలజ, అరకు

ఇక్కడే కొనసాగించాలి



నేను జన్మించిన చిట్టివలసకు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వచ్చిందన్న ఆనందం ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. మహిళా డిగ్రీ కళాశాల అవసరం ఉండటంతో చాలామంది చేరడానికి సిద్ధంగా ఉన్నారు. కళాశాలను ఇక్కడే కొనసాగించాలి.

తాటిపూడి శ్రావణి, సంతపేట

ఇక్కడి వాతావరణం బాగుంది



ఇక్కడి వాతావరణం బాగుండటంతో మా తల్లిదండ్రులు ఈ కళాశాలలో చేర్పించారు. ఇక్కడే హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాను. ఇప్పుడు కళాశాలను తరలిస్తామంటున్నారు. అలా చేయొద్దు. వసతులు పెంచి కళాశాలను ఇక్కడే కొనసాగించాలి.

పి.చంద్రిక, తుని

ప్రభుత్వం స్థలం కేటాయించాలి



ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు ప్రభుత్వమే స్థలం కేటాయించి వసతులు కల్పించాలి. ఒకసారి కళాశాల ఇతర ప్రాంతాలకు వెళితే తిరిగి రావడం కష్టం. ఇక్కడే అనువుగా ఉంది.

వి.గున్నమ్మ, చింతపల్లి

అర్చకుల మేలుకు సీఎం జగన్ ప్రత్యేక కృషి



కరపత్రం ఆవిష్కరిస్తున్న అర్చకులు

భీమునిపట్నం: అర్చకుల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మేలు చేస్తున్నారని అర్చక సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు రొంపిచర్ల సింగరాచార్యులు అన్నారు. శుక్రవారం ఇక్కడి శ్రీకృష్ణాలయం వద్ద 'గుడిగుడికి అర్చక సమాఖ్య' కార్యక్రమంలో భాగంగా అర్చకులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాల గురించి తెలియజెప్పే కరపత్రాలు ఆవిష్కరించారు. గతంలో అర్చకులు చాలీచాలని జీతాలతో జీవించేవారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో సీఎం జగన్ తమకు వేతనాల పెంపు, వృత్తికి భరోసా, ఇళ్లు అందించే కార్యక్రమం వంటివి నిర్వహిస్తూ, ఆరోగ్యశ్రీ కార్డులు కూడా అందిస్తున్నారన్నారు. అలాగే అర్చక సంక్షేమ నిధి ఏర్పాటు, ఇతర సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. సీఎం జగన్ పెద్ద మనసుతో తమకు చేస్తున్న ఈ మేలు ఎన్నటికీ మర్చిపోమని, ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని అన్నారు. కార్యక్రమంలో పలు దేవాలయాల అర్చకులు పాల్గొన్నారు.

గ్రంథాలయం ప్రారంభం

భీమునిపట్నం: భీమిలిలోని బోయివీధిలో గ్రంథాలయాన్ని జాలరుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పెద్దల చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు. సంఘం అధ్యక్షుడు కొక్కిరి నూకరాజు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉండే యువతతో పాటు ఇతరులు కూడా మంచి విషయాలు తెలుసుకునేందుకు దీన్ని ఏర్పాటు చేశామన్నారు. గ్రంథాలయంలో యువతకు అవసరమైన పోటీ పరీక్షల పుస్తకాలతో పాటు విజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పెద్దలు కదిరి ఎల్లాజీ, వాడమొదల సత్యారావు, కాసరపు నాగరాజు, కాసరపు ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



చిన్ని (ఫైల్ ఫొటో)

ఆనందపురం : మండలంలోని బోని గ్రామానికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైనట్టు శుక్రవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బోని గ్రామానికి చెందిన మద్దిల చిన్ని డ్వాక్రా సంఘాల లీడర్‌గా పని చేస్తున్నారు. ఆమె గ్రూపు సభ్యుల వద్ద రుణ వాయిదాలు వసూలు చేసి బ్యాంక్‌లో జమ చేయడం వంటి పనులు నిర్వహిస్తుంటారు. ఇదిలా ఉండగా ఇటీవల డ్వాక్రా సంఘాల సభ్యుల వద్ద వసూలు చేసిన సొమ్మును లింగాలవలస గ్రామానికి చెందిన తన స్నేహితుడైన సత్యనారాయణకు అప్పుగా ఇచ్చారు. అతను తిరిగి ఇవ్వకపోవడంతో సంఘ సభ్యులు వత్తిడి తేవడంతో ఆమె పరారయ్యారు. ఈ నెల 17న ఆమె భర్త రాంబాబు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన పోలీసులకు చిన్ని పట్టుబడగా ఈ నెల 22న ఆమెను భర్త రాంబాబుకు అప్పగించారు. దీంతో కొద్ది రోజులు ఇంటి వద్దే ఉన్న ఆమె మరలా డ్వాక్రా సంఘాల సభ్యుల వద్ద సొమ్ము వసూలు చేసి పరారయ్యారు. వెదికినా ఫలితం లేకపోవడంతో భర్త రాంబాబు శుక్రవారం మరలా ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ స్తంభం సరి చేశారు



మధురవాడ అప్ బ్రిడ్జి సమీపంలో విద్యుత్ స్తంభం సరి చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మధురవాడ: కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం సరి చేయించారు. జీవీఎంసీ 6వ వార్డు మధురవాడ అప్ బ్రిడ్జి సమీపంలో డీమార్టు వెనుక ఎన్‌టీఆర్‌సీ/89/19 నంబరు గల విద్యుత్‌స్తంభం మొదలులో మట్టి, వాన నీటి ప్రవాహానికి కోరుకుపోవడంతో కూలిపోయే స్థితికి చేరింది. దీంతో స్థానికులు స్తంభానికి రక్షణగా కర్రలు అడ్డు పెట్టారు. ఎప్పుడేం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ ఉండేవారు. ఈ సమస్యపై 'కూలే స్థితిలో విద్యుత్ స్తంభం' శీర్షికన సాక్షి దినపత్రికలో శుక్రవారం వార్త ప్రచురితమైంది. దీనిపై మధురవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.వి.ఎస్.రామమూర్తి స్పందించారు. విద్యుత్ స్తంభం మొదలులో సిమెంట్, కాంక్రీట్ వేయించి సరి చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి వ్యక్తి సేవాభావం అలవరచుకోవాలి



ఆశ్రమాన్ని ప్రారంభిస్తున్న చైతన్యానంద చిన్నస్వామి

తగరపువలస : ప్రతి వ్యక్తి తన సంపాదనలో కొంత భాగాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగించాలని విజయనగరం జిల్లా నెల్లిమర్ల దుర్గాశ్రమానికి చెందిన శ్రవణ చైతన్యానంద చిన్నస్వామి కోరారు. శుక్రవారం భీమిలి మండలం గొల్లల తాళ్లవలసలో భరోసా లవ్ ఫర్ హ్యుమానిటీ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ అట్టాడ అవినాష్ ఆధ్వర్యంలో లిటిల్ హగ్స్ అనాథాశ్రమాన్ని ఆయన ప్రారంభించారు. పేదరికం లేని సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరు సేవాభావం అలవరచుకోవాలన్నారు. ఎస్పీ నవీన్‌కుమార్ మాట్లాడుతూ నిరాశ్రయులైన చిన్నారులను ఆదుకోవాలనే ఆలోచన అభినందనీయమన్నారు. ఫ్రెష్ ఛాయిస్ ఈఈవో నరసింహారావు, మణికంఠ స్వీట్స్ అధినేత ఆదిమూలం నాగరాజు, టోష్టం అధినేత నరేష్, జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ నాగేశ్వరరావు, వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కరమాని అప్పలనాయుడు, చిల్ల హరి, ఎంపీటీసీ సభ్యుడు కోరాడ రమణ, టీం భరోసా కార్యదర్శి బల్లా శ్రీనివాస్, లిటిల్ హగ్స్ సభ్యులు వెంపాడ పద్మావతి, కమల, సంధ్య పాల్గొన్నారు.

దూడల పెంపకంలో శాస్త్రీయ పద్ధతులు పాటించాలి

ఆనందపురం : దూడల పెంపకంలో పాడి రైతులు శాస్త్రీయ పద్ధతులను పాటిస్తే అధిక పాలనిచ్చే ఆవులుగా రూపాంతరం చెందుతాయని పశు సంవర్థక శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డి.రామకృష్ణ చెప్పారు. మండలంలోని గొట్టిపల్లిలో శుక్రవారం పశు గణాభివృద్ధి సంస్థ, పశు సంవర్థక శాఖ సంయుక్తంగా లేగ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించాయి. ప్రదర్శనలో ఉంచిన దూడలకు టీకాలు, నట్టలు నివారణ మందు వేశారు. ప్రదర్శనలో 53 లేగ దూడలను ఉంచగా మజ్జి గణేష్, పైడి నాయుడు, గంట శ్రీనులకు చెందిన దూడలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించాయి. స్థానిక సర్పంచ్ గంటా జగదీశ్వరరావు బహుమతులు అందజేశారు. ఉప సంచాలకులు కరుణాకర్, రామ్మోహన్‌రావు, సహాయ సంచాలకుడు శ్రీనివాసరావు, ప్రసాదరావు, పశు వైద్యులు లీలా కుమారి, సంధ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతుడు

పీఎం పాలెం : గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటనపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివారాలు ఇలా ఉన్నాయి. వైఎస్సార్ క్రికెట్ స్టేడియం ఎదురుగా ఉన్న రోడ్డులో అపస్మారక స్థితిలో యువకుడు శుక్రవారం ఉదయం కనిపించడంతో స్థానికులు 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. సాయంత్రం ఆ వ్యక్తి మరణించినట్టు ఆసుపత్రి వర్గాలు పోలీస్ స్టేషన్‌కు తెలిపాయి. మృతుని వివరాలు తెలియ రాలేదని, గుర్తు తెలియని వ్యక్తి మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ప్రేక్షకుల మనసును రంజింపజేయాలి



మాట్లాడుతున్న సీతారామశాస్త్రి

పద్మనాభం: కళాకారులు ప్రేక్షకుల మనసులను రంజింపజేయాలని పౌరాణిక నాటక డైరెక్టర్ జొన్నలగడ్డ సీతారామశాస్త్రి అన్నారు. మండలంలోని మద్దిలో శుక్రవారం నిర్వహించిన అనంత పద్మనాభ నాట్యమండలి సంఘం కళాకారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పౌరాణిక నాటక కళాకారులు అవసరమైనప్పుడు మాత్రమే రాగాలాపన చేయాలన్నారు. నాటక రంగంలో జీవించాలి గానీ, కాలక్షేపం చేయకూడదన్నారు. ఉత్తరాంధ్ర కళాకారుల పౌరాణిక నాటక రంగం ఉపాధ్యక్షుడు ఉప్పాడ అప్పారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పౌరాణిక నాటక రంగ కళాకారులను ఆదుకోవాలని కోరారు. అనంత పద్మనాభ నాట్య మండలి కళాకారుల సంఘం అధ్యక్షుడు సామవేదం బాల సుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రెడ్డి కృష్ణమూర్తి, గౌరీశ్వరి, ఉమా శంకర్, పి.సింహాచలం, కోన లక్ష్మణరావు పాల్గొన్నారు.

రోడ్లపై దుకాణాల తొలగింపు



వ్యాపారులతో మాట్లాడుతున్న జెడ్సీ రాము

భీమునిపట్నం: భీమిలి మెయిన్‌రోడ్డుకు ఇరువైపుల ఉన్న చిరు వ్యాపారుల దుకాణాలను శుక్రవారం జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము ఆధ్వర్యంలో సిబ్బంది తొలగించారు. ఇక్కడి గంట స్తంభంతో పాటు మిగిలిన రోడ్డు మొత్తంలో ఎప్పటి నుంచో షాపులు నిర్వహిస్తుండటంతో రోడ్డు ఇరుగ్గా తయారయింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని జెడ్సీ ఇరువైపుల ఉన్న దుకాణదారులతో మాట్లాడి వారు నష్టపోకుండా రోడ్డుకు దూరంగా ఉన్న ఖాళీ ప్రదేశంలో దుకాణాలు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు వీటిని తొలగించి దూరంగా ఏర్పాటు చేయడం వల్ల రోడ్డు వెడల్పుగా మారిందని, తద్వారా వాహనాలు తిరగడానికి సదుపాయంగా ఉంటుందని తెలిపారు. అలాగే వ్యాపారులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. దీర్ఘకాలం నుంచి ఉన్న ఈ సమస్య పరిష్కారం కావడంతో అందరు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తగరపువలస వాసులకు తీరనున్న ఇంధన కష్టాలు

తగరపువలస: అంబేడ్కర్ కూడలిలో మూడేళ్ల క్రితం మూతపడిన పెట్రోల్ బంకు శనివారం పునః ప్రారంభం కానుంది. ఇక్కడి బీపీసీఎల్ బంకు మూతపడిన తరువాత వాహనదారులు అయిదు కిలోమీటర్ల దూరంలో ఉన్న భీమిలి టౌన్, మండలంలోని తాళ్లవలస పంచాయతీ, విజయనగరం జిల్లాలోని మహరాజుపేట, గుడివాడ పంచాయతీల వరకు వెళ్లి పెట్రోల్, డీజిల్ తెచ్చుకునేవారు. వాహనాల ఇంధనం పూర్తిగా అయిపోయిన తరువాత అంత దూరం వెళ్లి బాటిళ్లతో తెచ్చుకోవడం లేదా లీటర్‌కు అదనంగా రూ.10 నుంచి రూ.20 చెల్లించి పాన్‌షాపులలో విక్రయించే లూజ్ ఇంధనం కొనుగోలు చేసేవారు. భీమిలి నియోజకవర్గానికే ముఖ్య ప్రాంతమైన తగరపువలసలో పెట్రోల్, డీజిల్ అందుబాటులో లేక ఈ మూడేళ్ల పాటు వాహనదారులు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు మళ్లీ అదే కూడలిలో అదే బంకు ప్రారంభం అవుతుండటంతో వాహనదారులు ముఖ్యంగా ఆటో కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటింటా ఓటరు సర్వే పరిశీలన



ఇచ్ఛాపురంలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న తహసీల్దారు రామారావు

ఆనందపురం : మండలంలో జరుగుతున్న ఇంటింటా ఓటరు సర్వేను తహసీల్దారు లోకవరపు రామారావు శుక్రవారం పరిశీలించారు. బీఎల్‌వోలకు సూచనలు చేశారు. కుసులువాడ పంచాయతీ ఇచ్ఛాపురం గిరిజన గ్రామాన్ని సందర్శించిన ఆయన అక్కడి గిరిజన ఓటర్లను కలిసి వివరాలడిగి తెలుసుకున్నారు. అక్కడి గిరిజనులు బాకురుపాలెంలో ఉన్న 53వ నంబర్ పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు వేయవలసి వస్తోందని తహసీల్దారుకు వివరించారు. 53వ పోలింగ్ బూత్‌లో ఇచ్ఛాపురం ఓటర్లతో పాటు కుసులువాడ పంచాయతీ పరిధిలోని రేగాని గూడెం, చిన్నయ్యపాలెం గిరిజనులు, పందలపాక, సీతంపాలెం ఓటర్లు కూడా ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. దూరాభారంగా గ్రామాలు, రెండు పంచాయతీల ఓటర్లు ఒకే బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకోవడంతో గందరగోళంగా మారుతోంది. స్థానిక ఎన్నికల సమయంలో మాత్రం ఓటర్లు స్థానికంగానే ఓట్లు వేస్తున్నారు. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలకు సంబంధించి బాకురు పాలెం బూత్‌కు వెళ్లవలసి వస్తోంది. దీంతో అధికారులు ఓటర్ల విజ్ఞప్తిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు.

నిర్మాణాల్లో ఉల్లంఘనలు సహించం

- జోన్–2 ఏసీపీ వెంకటేశ్వరరావు
- అనధికార నిర్మాణం తొలగింపు



అక్రమ కట్టడాలు తొలగించిన అనంతరం స్టిల్ట్ ఫ్లోర్

మధురవాడ: భవన నిర్మాణాల్లో ఉల్లంఘనలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని జీవీఎంసీ జోన్–2 టౌన్ ప్లానింగ్ ఏసీపీ కూన వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. జీవీఎంసీ 8వ వార్డు మధురవాడ తారకరామా లే అవుట్‌లో ఓ భవనం యజమాని నిబంధనలకు విరుద్ధంగా స్టిల్ట్ ఫ్లోర్‌లో సగభాగం పైనే పార్కింగ్ స్థలంలో నిర్మాణం చేయడంతో ఏసీపీ పర్యవేక్షణలో సిబ్బంది శుక్రవారం తొలగించారు. ఏసీపీ మాట్లాడుతూ భవనాల ప్లాన్లకు సంబంధించి ఉల్లంఘనలపై ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నారని చెప్పారు. నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేసుకోవాలని, కూలగొట్టే పరిస్థితి తీసుకురావద్దని కోరారు. కార్యక్రమంలో టీపీఎస్ ఝాన్సీ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తవలస ఎంఈవోపై చర్యలకు డిమాండ్



మధురవాడ ఆర్‌జేడీ ఆఫీసు వద్ద ధర్నా చేస్తున్న యూటీఎఫ్ విజయనగరం శాఖ నాయకులు

మధురవాడ: ఉపాధ్యాయులను వేధిస్తున్న విజయనగరం జిల్లా కొత్తవలస మండల విద్యాశాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలని ఆ జిల్లా యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మధురవాడలోని విశాఖపట్నం జోన్ విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యాలయంలో ఓ ఉపాధ్యాయుడు సర్వీసు రిజిస్టర్ పోయిందని, ఎస్ఆర్‌ని సదరు ఉపాధ్యాయుడు తీసుకున్నట్టు ఫోర్జరీ సంతకం చేయించడం, మూడేళ్ల ఇంక్రిమెంట్‌లు నిలిపివేయడం వంటి తప్పుడు చర్యలకు పాల్పడిన ఎంఈవోపై తాము ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అయినా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఏడీ శ్రీరామమూర్తికి వినతి పత్రం అందజేశారు. ఎంఈవోకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ ధర్నాలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు, విజయనగరం, అనకాపల్లి, విశాఖ జిల్లాల ప్రధాన కార్యదర్శులు జేఏవీఆర్‌కే ఈశ్వరరావు, జి.చిన్నబ్బాయి, ఆర్.అంబేడ్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి, డి.రాము, నాయకులు అప్పారావు, కె.ప్రసాదరావు, పి.త్రినాథ్, పి.వాసుదేవరావు పాల్గొన్నారు.

ఆహార వ్యర్థాల నుంచి కంపోస్ట్ తయారీ



శిక్షణ పొందుతున్న రైతులు

కొమ్మాది: వృథాగా పారవేసే ఆహార పదార్థాల నుంచి కంపోస్ట్ తయారు చేసి పంటల దిగుబడి ఏ విధంగా పెంచవచ్చో తెలియజేస్తూ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం పర్యావరణ శాస్త్ర విభాగం చేపట్టిన ప్రాజెక్టు సత్ఫలితాలను ఇస్తోందని ప్రాజెక్టు ప్రధాన నిర్వహణ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం మంజూరు చేసిన ప్రాజెక్ట్ సైన్స్ ఫర్ ఈక్విటీ ఎంపవర్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్‌లో భాగంగా ఉత్తరాంధ్ర జిల్లాలోని రైతులకు శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. వ్యర్థంగా వదిలివేసే ఆహారంలో ఉన్న పోషక విలువలు గుర్తించి, వాటిని చిన్న గుళికలుగా మార్చి వాటిని వ్యవసాయ రంగంలో రైతులు వాడటం వలన పంట దిగుబడులు పెరుగుతున్నట్లు తాము గుర్తించామని తెలిపారు. దీనికోసం ప్రత్యేకంగా గీతం ప్రాంగణంలో కంపోస్ట్ తయారీ కేంద్రం నెలకొల్పి, ప్రయోగాత్మకంగా 250 మంది రైతులకు అందించామని తెలియజేశారు.